క్లుప్తంగా

ఉపాధి పనులు ప్రారంభించండి


మాట్లాడుతున్న ఏపీడీ బాలాజీనాయక్

పాణ్యం: 2023–24కు సంబధించి ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని ఏపీడీఓ బాలాజీనాయక్ తెలిపారు. శుక్రవారం ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి పనులు ప్రారంభించాలని, మండలంలో ప్రతి రోజు 5వేల మందికి కూలీలు పనుకెళ్లాలన్నారు. గ్రామ పంచాయతీల వారీగా కూలీల సంఖ్యను కేటాయించామన్నారు. ఇదివరకే తీసుకున్న గ్రామ తీర్మానాలు, వ్యవసాయ అనుబంధ పనులు, ఉద్యానవన సాగు లక్ష్యాలు, కొబ్బరి మొక్కల సాగు తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు విజయ రాణి, శేఖర్‌గౌడ్, ఈసీ రజాక్, టీఏలు, ఎఫ్ ఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ఓర్వకల్లు: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఈశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని హుసేనాపురం అంగన్‌వాడి కేంద్రంలో ముందస్తు సంక్రాంతి పండుగను జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు మధ్యాహ్నం భోజనం తర్వాత గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్‌తో పాటు, కాల్సియం మాత్రలు వేయాలని సూచించారు. బరువు తక్కువ గల వారిని గుర్తించి సాధారణ స్థితికి వచ్చేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వైద్యులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సుంకేసులకు స్వల్ప ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం స్వల్ప ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. పైనుంచి 1,050 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, కేసీ కాల్వకు 817 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు. డ్యామ్‌లో 0.917 టీఎంసీల నీరు నిల్వ ఉందని, దిగువకు నీటి విడుదల నిలిపేసామన్నారు.

నేటి నుంచి దస్తగిరయ్య స్వామి ఉరుసు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో ఈ నెల 14 నుంచి 16 వరకు దస్తగిరయ్యస్వామి ఉరుసు నిర్వహించనున్నట్లు శుక్రవారం పీఠాధిపతి సమస్యద్ అక్బర్‌బాషా ఖాద్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం గంధం, ఆదివారం ఉరుసు, సోమవారం జియారత్‌ను నిర్వహించనున్నామని, భక్తులు తరలివచ్చి ఉరుసు మహోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కర్ణాటక సీఎంకు ఘన స్వాగతం

ఓర్వకల్లు: శ్రీశైలం పర్యటలో భాగంగా శుక్రవారం ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్న కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మైకు జిల్లా ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఉదయం 11.45 గంటలకు ప్రత్యేక విమానంలో సీఎం ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప, నీటి వనరుల శాఖ మంత్రి గోవింద్ కర్జోల్ ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, ఎస్పీ సిద్దార్థ కౌశల్, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున తదితరులు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. శ్రీశైలం పర్యటన అనంతరం సీఎం సాయంత్రం 5.50 గంటలకు తిరిగి కర్ణాటకకు బయలుదేరి వెళ్లారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

కర్నూలు : ప్రమాదవశాత్తు కిందపడిన జొహరాపురంలోని మాబుసుభాన్ కాలనీకి చెందిన జాఫర్ ఖాన్ (48) కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించే ఈయన ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో మెట్లు ఎక్కుతుండగా కాలు జారి కింద పడ్డాడు. నుదుటిపై తీవ్ర గాయమై ముక్కులో నుంచి రక్తస్రావమైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఈయనకు కొడుకు, కూతురు సంతానం. భార్య షమీమ్ ఖాతూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం కేంద్రంలో చోరీకి విఫలయత్నం

కర్నూలు పాతబస్తీలోని చిత్తారి వీధిలో ఉన్న ఏటీఎం కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. శుక్రవారం తెల్లవారుజామున ఏటీఎం కేంద్రంలో చొరబడి మిషన్‌కు ఉన్న స్క్రూలను తొలగించే ప్రయత్నం చేయగా అలారం మోగింది. దీంతో దుండగుడు పారిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గస్తీ పోలీసులు ఆ ప్రాంతంలో కలియదిరిగి దొంగ కోసం గాలించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అన్నివిధాలుగా తీర్చిదిద్దుతామన్నారు. కర్నూలు మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు పూలమాలలు వేసి, హారతిచ్చి ఆహ్వానించగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బొకేలు అందజేసి గజమాలలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించిన ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు టీడీపీ సానుభూతి పరులకే పథకాలు అందించేవారని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులైనవారందరికీ వలంటీర్ల ద్వారా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తుందని గుర్తుచేశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. రైతు ప్రభుత్వమంటే మాదే అని గర్వంగా చెప్పుకునేలా జగనన్న రైతులకు అండగా ఉంటున్నారని చెప్పారు. మూడేళ్లలో జగనన్న అమలు చేసిన సంక్షేమం పథకాలతో అభివృద్ధి పరుగులు పెడుతుందని, మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దిగువపాడు గ్రామంలో విస్తృతంగా పర్యటించిన డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంత మంది పిల్లలు ఉన్నారు.. తల్లులు, పిల్లలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా సరఫరా చేస్తున్నారా ? అని ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం తీసుకునేలా చూడాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడంతో రక్తహీనతను నివారించవచ్చననే విషయాన్ని వారికి వివరించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, గిరిజోన్, సర్పంచ్ సౌభాగ్యలక్ష్మీ, ఎంపీటీసీ కృష్ణవేణి, డీవీఎంసీ సభ్యులు రవిశాస్త్రి, గార్గేయపురం, పసుపుల సొసైటీల అధ్యక్షులు వినయ్‌కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, సర్పంచ్ విద్యాసాగర్, ఉప సర్పంచ్ మల్లశివుడు, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ సర్పంచ్ ఏసేపు, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో శనగ దిగుబడులు కొనుగోలు

కోడుమూరు: శనగ దిగుబడులను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందని పశుసంవర్ధక శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి, మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ మండలి మండల సభ్యుల సమావేశం ఏఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి తీసుకున్న చర్యలను, చేపడుతున్న పథకాలను వివరించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో శనగపంట దిగుబడుల ధరలు తగ్గిపోవడంతో ప్రభుత్వం మద్దతు ధర క్వింటాం రూ.5,380 ప్రకారం కొనుగోలు చేసత్తుందని, రైతులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాన్నారు. అదేవిధంగా గ్రామాలలో జరుగుతున్న రబీ పంటలసాగు నమోదను రైతులు దగ్గరుండి వ్యవసాయ సిబ్బందితో పూర్తి చేయించుకోవాలని సూచించారు. మద్దతు ధరల కొనుగోలు కేంద్రాలను మండలంలో త్వరగా ఏర్పాటు చేయాలని సలహా మండలి సభ్యులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఈఓ తస్లీమ, సలహా మండలి సభ్యులు రామ్‌మనోహర్ రెడ్డి, శంకర్, జలీల్‌బాష, సురేంద్రరెడ్డి, బీరప్ప, నాయుడు, రైతులు ఉన్నారు.

లొద్దిపల్లె గంగమ్మ కుంటను అభివృద్ధి చేస్తాం

- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి


కూలీలతో మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామ సమీపంలోని గంగమ్మ కుంటను ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేస్తామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక గంగమ్మ కుంటలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు శాతం, మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా పనులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఉపాధి పథకం ద్వారా గంగమ్మ కుంటను అభివృద్ధి చేసి, బ్రాహ్మణపల్లె తరహాలో మరో అమృత సరోవర్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. గ్రామాలలో కూలీల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎల్‌ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్ సాయినాథ్, ఈసీ మధు వెంకటకృష్ణ, సాంకేతిక సహాయకులు శాంతి, క్షేత్ర సహాయకులు నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: గ్రామీణ ప్రజల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీఓ రాముడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల అభ్యున్నతిలో భాగంగా ప్రభుత్వం నవరత్నాలను అమలు చేస్తుందని, అర్హులైన వారికి పథకాలను నిర్ణీత కాలంలో అందేలా కార్యదర్శులు కృషి చేయాలన్నారు. సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లను సమన్వయం చేస్తూ అర్హులు నష్టపోకుండ చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ప్రభుత్వ విధులపట్ల నిర్లక్ష్యం వహించే వలంటీర్లు, ఉద్యోగులు, పీఎస్‌లపై శాఖాపరమైన చర్యలుంటాయని ఎంపీడీఓ హెచ్చరించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. సభ్యులు, రైతులు, సిబ్బందితో వ్యవసాయ అంశాలపై చర్చించిన అనంతరం రైతు భరోసా సంచికలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం రాయతీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. యంత్రాలు అవసరమైన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలని సూచించారు. రైతుల అభివృద్ధి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఏఓ వివరించారు.

ఆడపిల్లల సంరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఆడపిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు పెంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులు కమిటీ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. వీటిని జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సభ్యులు పరిశీలించి అనంతరం డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రజలు, ఎన్‌జీఓల సహాయంతో డిగ్రీ, ఇంటర్, నర్సింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరమణ, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ విజయానందబాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఎన్‌జీవో ప్రతినిధులు కె. శ్రీనివాసులు, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెచ్ఈ పద్మావతి, ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

మారుతున్న ప్రధాన దారులు

- చురుగ్గా సాగుతున్న రోడ్ల నిర్మాణ పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు


యూనియన్ బ్యాంక్ నుంచి వేసిన సీసీ రోడ్డు


సుంకులమ్మ ఆలయం ఎదుట నిర్మిస్తున్న సీసీ రోడ్డు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం రహదారుల రూపురేఖలు మారుతున్నాయి. ప్రజలు పడిన ఇబ్బందులు తొలగనున్నాయి. ఏళ్లుగా ప్రధాన వీధులు అభివృద్ధి నోచుకోక, ప్రధాన రోడ్డు అక్రమణలకు గురికావడంతో రాకపోలకు వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డులో ఓ వాహనం ఎదురెదురుగా వెళ్లాలంటే పడారానిపాట్లు పడేవారు. వైఎస్సార్ సర్కిల్ నుంచి డొంగు వరకు ఇదే దుస్థితి. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. పాణ్యంలో రోడ్లను విస్తరించి కాల్వల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కాటసాని చర్యల మేరకు అధికారులు అక్రమణలకు గురైన రోడ్డును తొలగించి సుమారు అడుగుమేరా సీసీ రోడ్డును వేస్తున్నారు. ప్రస్తుతం వేస్తున్న సీసీ రోడ్డును చూసి గ్రామస్తులు నివ్వెరపోతున్నారు. మారుతున్న రోడ్ల తీరుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ అండర్ డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద మరింత వెడల్పు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పనులు చేస్తున్నారు. ఇందు కోసం దాదాపు రూ.80లక్షలకుపైగా నిధులను కేటాయించారు అధికారులు. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఐజాక్ యంత్రం సాయంతో రోజుకు 50–60మీటర్ల వరకు సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. పాణ్యం గ్రామానికే ఇదే అతి పెద్ద ప్రధాన రోడ్డు కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు దగ్గర ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నారు. ప్రధాన రోడ్డు కావడంతో జాగ్రత్తలు తీసుకోని గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు.

17న బహిరంగ వేలం పాటలు

గడివేముల: మండల పరిధలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వక్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు సంబంధించి ఈనెల 17న వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా తాత్కాలికంగా చెరుకుగడలు, ఐస్, కూల్‌డ్రింక్స్, సప్లయర్ బాడుగకు, పండ్ల విక్రయించుకునేందుకు ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనాలని ఈఓ చెప్పారు.

17 నుంచి జిల్లా స్థాయి శాప్ లీగ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి జిల్లా స్థాయి శాప్ లీగ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఓపెన్‌–టు–ఆల్ పురుషుల 7 ఏ సైడ్ ఫుట్‌బాల్ పోటీలు, 18 వ తేదీ అండర్–13, అండర్–17 విభాగాల్లో టేబుల్ టెన్నిస్, అండర్–19 విభాగంలో జూడో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆత్మరక్షణకు తైక్వాండో అవసరం

కర్నూలు (టౌన్) : ఆత్మరక్షణకు తైక్వాండో వంటి క్రీడలు అవసరమని సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ వాసురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పెద్దమార్కెట్ లక్ష్మీ కళ్యాణ మండపంలో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ చిన్నతనం నుంచే మార్షల్ ఆర్ట్స్ వైపు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. దీని వల్ల మానసిక వికాసం కలుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు, వీరేష్ పాల్గొన్నారు.


అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, రాజకీయాలకు, మతాలకు, కులాలకు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 36వ వార్డు పరిధిలోని గురు రాఘవేంద్ర నగర్, వాసవీనగర్‌లలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి చిత్రంతో ఉన్న బుక్‌లేట్‌లను లబ్ధిదారులకు అందించి వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఏదైన పథకం పొందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు తప్పనిసరిగా ఉండాలన్నారు. తమ ప్రభుత్వంలో అలాంటి వాటికి చోటు లేదన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రెండోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దండు లక్ష్మీ కాంతరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. హనుమంతురెడ్డి, వార్డులోని స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తలసీమియా, సికిల్‌సెల్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం


తలసీమియా చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కేంద్రం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కమలా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఫర్ తలసీమియా అండ్ సికిల్‌సెల్ పేషంట్స్(టీఎస్‌సీఎస్) శుక్రవారం కర్నూలులో ప్రారంభమైంది. హైదరాబాద్‌కు చెందిన టీఎస్‌సీఎస్ తన కొత్త కేంద్రాన్ని స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులోని హెచ్‌డీసీటీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేశారు. కర్నూలుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తలసీమియా పిల్లల సంరక్షణ కోసం కేంద్రం లేదు. ఇలాంటి సమయంలో తలసీమియా నిర్మూలన కోసం పనిచేస్తున్న టీఎస్‌సీఎస్ ఇప్పుడు కర్నూలులో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని కర్నూలు కేంద్రం అధ్యక్షులు చంద్రకాంత్ అగర్వాల్ చెప్పారు. తలసీమియా ఒక జన్యుపరమైన రక్త రుగ్మత అని, ప్రతి గర్భిణి తనంతట తానుగా పరీక్ష చేయించుకుంటే తలసీమియా పిల్లల పెంపకం, సంరక్షణలో జీవిత కాలాన్ని పెంచవచ్చన్నారు. టీఎస్‌సీఎస్ ఇప్పటికే హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కర్నూలులో తన కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కేంద్రానికి అధ్యక్షులుగా చంద్రకాంత్ అగర్వాల్, కార్యదర్శిగా డాక్టర్ సుమన్‌జైన్, వైస్ ప్రెసిడెంట్‌గా కె. రత్నావళి, జాయింట్ సెక్రటరీగా అలీంబిగ్, మనోజ్‌రూపని, చీఫ్ ప్యాట్రన్‌గా నరేష్ రతి, కర్నూలు బ్లడ్ ఆర్గనైజర్‌గా సుమన్, విజయ్, రమేష్, లోకేష్, విరూపాక్షి వ్యవహరించనున్నారు.


పెసరవాయి సమీపంలో శనగ పైరుకు స్ప్రింకర్లతో నీరందిస్తున్న దృశ్యం

పంటలు కళకళ!


గడిగరేవుల గ్రామంలో విరగ్గాసిన జొన్న పంట

గడివేముల: పంట పొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయి. వర్షాలు సంమృద్ధిగా కురువడం.. బోర్లలో నీరు బాగా లభ్యం కావడం...కేసీ కెనాల్‌కు నీటి సరఫరా చేస్తుండడంతో పంటలు పచ్చగా దర్శనమిస్తున్నాయి. అధికారుల సహకారంతో రైతులు సాంకేత పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ డ్రిప్, స్ప్రింకర్లు వాడుతూ పంటలను పండిస్తున్నారు. మండలంలో ప్రధానంగా జొన్న, మొక్కజొన్న, మినుము, శనగ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లో నీళ్ల లేకపోవడంతో కొంతమంది రైతులు మాత్రమే సాగుచేసేవారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో 16 వేల ఎకరాల వరకు సాగైనట్లు వ్యవసాయాధికారుల సమాచారం. అత్యధికంగా జొన్న 6వేల ఎకరాలు, మొక్కజొన్న 4వేల ఎకరాలు రైతులు సాగు అయ్యింది. మినుము, సోయాబీన్, వరి సాగు చేశారు.

రూ.2 కోట్లతో ఈట్ స్ట్రీట్ పనులు


పనుల ప్రగతిపై ఆరా తీస్తున్న కమిషనర్ భార్గవ్ తేజ

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక బిర్లాగేట్ వద్ద రూ.2 కోట్లతో ఈట్ స్ట్రీట్ పనులు చేపడుతున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక బిర్లాగేట్ వద్ద అందుకు సంబంధించిన పనులపై మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పెయింటింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆటవిడుపు కోసం సాయంత్రం వేళ పిల్లలు, పెద్దలు, కుటుంబ సభ్యుల కోసం ఇక్కడ ఈట్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తిను బండారాలు, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా జారుబండ, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్, పార్కింగ్ వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అలాగే స్థానిక జొహరాపురం వద్ద ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఈఈ షాకీర్ అహమ్మద్ పాల్గొన్నారు.